# "కలియాన[80] వైరాగ్గెం"

**మా** సెల్లె నా కన్న మూడేండ్లు సిన్న. అది నేను చిన్నప్పుడు కచ్చకాయలాడుకునెటోల్లం. చిన్న చిన్నాటికి జవుడాలు[81] పెట్టుకుందుం. మల్ల పొత్తుగూడుదుం. నువ్వేం ఊల్లు సూసినవంటె నువ్వేం జూసినవని వాదించుకుందుం. సుట్టాలూల్లు ఇద్దరమొక్కన్నే సూసినం. ఓదెల మల్లన్న ఎముడాల రాజన్న, పెద్దాపురెపు మల్లన్న, లోపాట పొసవ్వ, యాలాల జాతర, నాంపెల్లి నర్సిమ్మసామి గివ్వన్నిగూడ అవ్వయ్యతోని పొయ్యి ఇద్దరం జూసినం. కని అయిలోని మల్లన్న, కొమురెల్లి మల్లన్న కాడికి నేం బోలే. గప్పున్నాకు బడుందని ఇంటికాన్నే ఉంచిపెయింఋు. గా రొండూల్లు ఎక్కో సూసిన్నని ఊకనేది. ఇగేమనన్నా నాకు తెలవుకపొయ్యేటిది. నేను సదువుకొని పెద్దోన్నయినంక దానికంటెక్కో ఊల్లు మా సూత్తనని సెప్పెటోన్ని.

మా ఇద్దరు సిన్నాయిన్నల దగ్గెర సెరొగలం కూసుండెటోల్లం. మా పెద్ద సిన్నాయిన్న-నేను అయినె కొడుకో జట్టయితె, మా సిన్న సిన్నాయిన-చెల్లె-పెద్ద చిన్నాయిన్న బిడ్డ ఇంకో పార్టి. పెద్ద మల్లయ్య గుట్ట నాదంటే, కాకుల బోరు దాందని గట్ల ఒగలనొగలం దెప్పుకునెటోల్లం. శాత్రాల లేసుకునెటోల్లం. ఓడిపోయినోల్ల సేతుల్ల గెలిచినోల్లు కొట్టెటోల్లం. గిట్ల చిన్నప్పుడు మంచిగ కలిసాడుకున్నం. అదెవెసప్పునికి వోతె నేను బడికి పొయ్యెటోన్ని. పొద్దు గూకినంకిగ ఆటే.

దానికాటకోయిల[82] తనమన్న తీరకమునుపే నేనెనిమిదో తరగతిలుండంగనే దానికి లగ్గం జేత్తనన్నరు. గప్పుడు దానికి లగ్గమంటేందో తెలువనే తెలువది. నాగ్గూడేం తెలువది. కని లగ్గం సేసుకుంటావె అంటె మా సేసుకుంటనన్నది. లగ్గమంటప్పుడు బాసింగాలు కుట్టుకునుడు, పల్లాకిల కూసుండి తిరుగుడు, **కొత్త** ఒల్లె కట్టుకునుడు బీంబాజ సప్పుల్లని గింతేనె నెరుక. చెల్లెకు లగ్గమన్న మోలె నేంగూడ మస్తు **వం**బురపడ్డ. ఎందుకంటె బాగమంది సుట్టాలత్తరు. ఆల్లతోని తిరుగచ్చు. పల్లాకిల నేంగూడ కూసుండచ్చు. లడ్డూలు. బొక్క కూర గిట్ట మస్తుగ తినచ్చు. పదిగేన్నగల గొర్లు, ఆవులాగె, పదిగేన్నూర్ల కట్నమిచ్చుడు ఇంటికి సున్నాలేపిచ్చినం. మొగురాలకు, దరువాజలకు రంగురంగుల కాయిదాలు కత్తిరిచ్చి అతికిచ్చినం. ఆకిట్ల పెద్ద పందిరేసినం. జోరుదారుగ ఇల్లంత తయారుజేసినం.

లగ్గంనాడు ఎదురుకోల్లకాడ నాతో మా బాప నోట్లె శెక్కరి పోపిచ్చింఋు. ఇయ్యంపుని నోట్నొండ

పొయ్యిమని బాగ పోయించిండు. బాజలోల్లు బాజలు గొడుతంటె, కొందరు డాన్సుజేత్తంటె బావను పల్లాకిల కూసుండవెట్టి లగ్గం పందిట్లకు తీసుకచ్చినం. మైలపోల్దీసి, పొలువోసి పీటలమీన కూసుండవెట్టింండ్రిద్దర్ని. అయ్యగారు మంత్రాల్జదివిండు. బాసింగాలు గట్టుకున్న ఆల్లిద్దర్ని సూత్తంటె నాకు ఖుషనిపిచ్చింది. అటెనుక తాలిగట్టుడు, ఒగలమీనొగల తలువాలు పోసుకునుడు అయినయి. సానమంది కట్నాలు సదివిచ్చింండ్రు. లగ్గం తెల్లారి విందులయినయి. సియ్యకూర లడ్డూలతో బువ్వేమో పొద్దుగాల. పగటీలి కల్లు, గుడాలతోని దావతు. మల్ల రాత్తిరి బొక్కకూరతోనే బువ్వ. ఐదారుగొర్లు దెగినయి.

తాగి ఒగలతోనొగలు మస్తు పరాశికాలాడుకున్నరు. నా పని బువ్వ తిన్నంకందరికి బీడీలిచ్చుడు. చిన్న పొల్లగండ్లడుగుతె తిట్టి బీడీలియ్యలే. తెల్లారి చెల్లెనత్తగారింటికి సాగదోలుటానికి తయార్జేసింండ్రు. గప్పుడిగ అందరి మొకాలు వాడిపెయినయి. అందరికి కండ్లల్ల నీల్లచ్చినయి. మంచిగది పల్లాకెక్కిపోతంటె గీల్లంత గిట్లెందుకున్నరని నాకప్పుడు ఇర్గ[83] పరేశానైంది. గప్పున్నేనెంతాలోసించినా అరుతం గాలే. పల్లాకిల బావను, సెల్లెను కూసుండవెట్టి బీంబాజల సప్పుడుతోని ఊరవుతలిదాక తీసుకపెయింండ్రు. పల్లాకెనుక సవారుబండ్లు... ఊరవుతల పల్లాకాపిండ్రు.....దించింండ్రు. బండ్లన్నాగినయి. అవ్వకండ్లల్ల కదిలిత్తె బొల్లుమనేట్లెటట్టు ఒక్క మాటన్న మాట్లాడకుంట బొల్లుమనేడ్సింది. కొంతసేపేడ్సి అందరూకుంచితె ఊకుంది.

"అదినే ఇగో. గిదొక్కతె నాకాడిపొల్ల. ఇన్నేండ్లవట్టి పానమోలె సాదుకున్న. ఇయ్యాల్ల నీ సేతుల వెడుతన్న. దాని బారం నీదే" అని అత్త కాల్లు మొక్కింది.

ఆల్లాడి బిడ్డ సేతిలవెట్టి

"దీన్ని నీ చెల్లెలెక్క జూసుకో. ఏదన్న తప్పుజేసినా కడుపుల దాసుకో" అంది.

"బిడ్డా...! ఇయ్యాల్లట్నుంచి నీకవ్వయిన, అత్తయిన మీ అత్తే. ఆమె సెప్పినట్టిను. ఎదురు మాట్లాడకు. పదిమందిల ఫక్కుమని నవ్వకు. బావలెదురైతె దూరం జరుగు. ఇండ్లపొంటి తిరుగకు' ' చెల్లెకు చెప్పి బొచ్చెకత్తుకొని నిమిరందవ్వ.

"బావ! గిదొక్కతె నాకున్న పొల్ల. కడుపుల వెట్టుకోని సాదుకున్నం. గిదీనికేమైనా నాకు రంపెంతోని కోసినంత బాధైతది. ఇప్పటికెల్లి తల్లిదండ్రి అన్ని మీరే" అని నాయిన్న సెల్లె న్లాలమామసేతుల్ల వెట్టి కండ్లనీల్లు దీసుకున్నడు.

"చిన్న పిల్ల. తెలువకేదన్న తప్పు జేసినా గనోర్సుకోండ్రి. బిడ్డోలె సూసుకోండ్రి. ఇగ దాని బారం మీదే" అని సాన సార్లు అవ్వ, నాయిన్న ఆల్లతోన్జెప్పింండ్రు.

మా చెల్లె అత్త కొంచెమంతెడ్డి మొకంది అందరి మాటలిని

"ఏం వదినె. ఎందుకేడుత్తవు? మీరందరుండంగ నాకేం పరువ?" అంది.

గా మాటలకందరు నవ్విండ్రు. అటెనుక సెల్లెను నాతోని బావ సేతుల్ల వెట్టిచ్చిండ్రు. మంచిగ సూసుకొమ్మని మల్లమల్ల సెప్పిండ్రు. ఇంతల పల్లాకి లేవట్టిండ్రు. పల్లాకి కదులంగనే అవ్వ, నాయిన్న, సెల్లె, సోపతికాల్లంత మల్లోసారి గొడగాడేడ్సిండ్రు. పల్లాకి కనవడకుంటాయెదాక సూసి మేవంత ఇంటిమొకం పట్టినం. ఇంటికచ్చేటప్పుడు నాయిన్న సోపతికాల్లతోనన్న మాటలు నా కింకా యాదికున్నయి.

"పాయె...! ఇన్రోజులు సాదుకున్న పొల్ల ఇల్లిడిసి, ఊరిడిసిపాయె. నిన్నిట్దాక మనాకిలూడ్సింది. ఇయ్యాల్లట్నుంచాల్ల ఆకిలూడుత్తది. ఆడిపొల్లెన్నటికైన. అక్కడిపొల్లే. ఇగిప్పట్నుంచి ఈడికి సుట్టపుసూపుగ పండుగకో-పబ్బానికో వచ్చిపోతది. గీ దునియల ఎవ్వలకెవ్వలున్నరు? అక్కడ దాని బతుకెట్లుంటదో ఎవ్వలకెరుక? పొల్లగండ్ల కనుడు, మనసేతులందికని ఆల్ల రాతలు కనుడు మన సేతులుందా? అంతా ఆ మీదోన్దయి. రేపు లగ్గమయినంక నా కొడుకేమైతదో!? ఎట్లుంటె గట్లయితది పటు. రుణాణుబంధరూపేణా.........పశుపత్ని సుతాలయ అన్నరు పెద్దలు" అని వైరాగ్గెంతో ఇంకెన్నో మాట్లాడిండు. అందరమింటికచ్చినం. బోసిపెయినట్టున్న ఇల్లు జూసిన నాగ్గూడ ఎట్లనో అనిపిచ్చింది. అది లేకుంటె ఇల్లు సిన్నవెయినట్టే అనిపిత్తది.

గిప్పుడు గా సంగతులు యాదికత్తె మనుసు కొట్టుకుంటది. గప్పుడు మా అవ్వయ్య లెందుకేడ్సిండ్రనుకున్న నేను నా బిడ్డకు లగ్గం జేసి పంపెటప్పుడేడ్వనా అని ఆలోసిత్తె గంతకంటెక్కొనే ఏడ్తనేమోననిపిత్తది. ఏడ్త. నేనేంది? ఎవ్వలైనేడ్తరు. బాగ విచారిస్తె గీ ఏడ్పులకు మూలం గీ సమాజంలనే ఉందనిపిత్తది. అందరు లగ్గాలు జేత్తరు. కని ఎందరో ఆడపిల్లల బతుకులు గోరంగ బూడిదైతన్నయి. అత్తమామల పోరు, మొగనిపోరు, ఆడబిడ్డల ఆరల్లు, కట్నాలు, వరకట్నాలు, మొగోల్ల దూలానీ ఇంకా...:ఇంకా.....ఎన్నో ఆడిదాని బతుక్కు రక్షణనేది లేకుంట జేత్తన్నయి. పసుపుతాల్లు కొందరికురితాళ్ళే ఐతన్నయి. గందుకేనేమో అప్పగింతలప్పుడు గీ ఏడ్పులు........!

★ ★ ★